
నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, సోమవారం 20 మే 2024 | SANGAREDDY

# ప్రభుత్వం స్పందించకుంటే రోడ్డెక్కుతాం..

## వెంటనే తడిసిన ధాన్యాన్ని సర్కారు కొనాలి



మర్కూక్‌లో మహిళా రైతుతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

- స్పందించకుంటే రాజీవ్ రహదారిని ముట్టడిస్తాం
- అన్నిరకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

మర్కూక్, మే 19: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, ప్రభుత్వం స్పందించకుంటే వేలాది రైతులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలతో గౌరారం దగ్గర రాజీవ్ రహదారిని ముట్టడిస్తామని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా బీఆర్‌ఎస్ మర్కూక్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, జడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డితో కలిసి మర్కూక్‌లో రైతుల కళ్లాల వద్దకు వెళ్లి ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు పండించిన సన్న, దొడ్డు వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని, క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వాలని కాంగ్రెస్ సర్కారును డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. కొన్న ధాన్యానికి రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమచేసినట్లు తెలిపారు. కేసీఆర్ హయాంలో గజ్వేల్ నియోజకవర్గంలో కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ లాంటి ప్రాజెక్టులను నిర్మించి రైతులకు సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌కే చెల్లిందన్నారు. అలవికాని హామీలు, అసత్యపు ప్రచారంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతుల సమస్యలను విస్మరించిందన్నారు. మండలంలో దాదాపు 50 లారీల ధాన్యం రోడ్లపైన ఉందన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దమవుతున్నట్లు తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వేగంగా ధాన్యం సేకరణ పూర్తిచేయాలన్నారు. లేకపోతే పెద్దఎత్తున రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేస్తామని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. రైతు సంక్షేమానికి కృషిచేసింది బీఆర్‌ఎస్ మాత్రమే అన్నారు. ఏ ఒక్క హామీ కాంగ్రెస్ సర్కారు అమలు చేయడం లేదని వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆయన వెంట ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణయాదవ్, మేకల కనకయ్య, అచ్చంగారి భాస్కర్, సంతోష్‌రెడ్డి, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వృథాగా మిషన్ భగీరథ జలం

చేర్యాల, మే 19: మండలంలోని వేచరేణి శివారు ఎల్లదాస్‌నగర్‌లో తాగు నీటిని అందించే 10వేల లీటర్ల నీటి ట్యాంకు నుంచి నిత్యం మిషన్ భగీరథ జలాలు వృథాగా పోతున్నా పట్టించుకోవడం లేదు.కొన్ని గ్రామాల్లో ప్రజలు తాగు నీటికి తండ్లాడుతుంటే, మరిన్ని గ్రామాల్లో ఇలా తాగునీరు వృథాగా పోతున్నది. ఎల్లదాస్‌నగర్‌కు నీటిని అందించేందుకు 10వేల లీటర్లు, 20వేల లీటర్ల నీటి ట్యాంకులు ఉన్నాయి.ఇందులో ప్రభుత్వ పాఠశాల భవనాల పక్కనే ఎర్ర కుంట సమీపంలో ఉన్న 10వేల లీటర్ల నీటి ట్యాంకు నిండిపోయి గంటల పాటు గోదావరి జలాలలు వృథాగా ప్రవహిస్తూ, పక్కనే ఉన్న కుంటలోకి పోతుండడం గమనార్హం. ఇదే ట్యాంకు నుంచి నీళ్లు వృథా అవుతున్నాయని సమీపంలో ఉన్న హనుమాన్ ఆలయానికి ఓ పైపులైన్ ఏర్పాటు చేశారు. గంటల పాటు నీరు నేరుగా కుంటలోకి వెళ్లిపోయినా పట్టించుకోవడం లేదు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఎల్లదాసునగర్‌లో ట్యాంకు నుంచి వృథాగా పోతున్న తాగునీరు

# సంక్షోభంలో జీపీలు!

## పంచాయతీలకు నిధులేవీ?

- అధికారంలోకి వచ్చాక రూపాయి ఇవ్వని కాంగ్రెస్
- పడకేసిన పాలన.. అటకెక్కిన పారిశుధ్య పనులు
- ట్రాక్టర్లలో డీజిల్ పోయించలేక కటకట
- ట్రాక్టర్ల ఈఎంఐలు, వేతనాలు చెల్లించలేని దుస్థితి
- నాలుగు నెలలుగా పారిశుధ్య సిబ్బందికి అందని వేతనాలు
- కంపుకొడుతున్న డ్రైనేజీలు, డంపింగ్ యార్డులు
- ఎండిపోతున్న హరితహారం మొక్కలు
- కేసీఆర్ పాలనలో గ్రామాలు కళకళ.. నేడు వెలవెల
- ప్రభుత్వ తీరుపై గుర్రుమంటున్న గ్రామీణులు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 1615 గ్రామ పంచాయతీలు

*బీఆర్‌ఎస్ పాలనలో పచ్చదనం, పరిశుభ్రత, స్వచ్ఛతతో అలరారిన గ్రామాలు, నేడు కళావిహీనంగా మారుతున్నాయి. కొన్ని నెలలుగా పంచాయతీలకు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో పల్లెపాలన పడకేసింది. పారిశుధ్య నిర్వహణ సరిగ్గా జరగడం లేదు. పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి వేతనాలు రావడం లేదు. డీజిల్‌కు డబ్బులు లేక చెత్త సేకరణ ట్రాక్టర్లు మూలకు పడ్డాయి.డంపు యార్డులు కంపుకొడుతున్నాయి. హరితహారం మొక్కలు ఎండిపోతున్నాయి. మళ్లీ పాతరోజులు వస్తున్నాయి. సిద్దిపేట జిల్లాలో 499, మెదక్ జిల్లాలో 469, సంగారెడ్డి జిల్లాలో 647 గ్రామ పంచాయతీలు కలిపి మొత్తం ఉమ్మడి మెదక్ జిల్లాలో 1615 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రతినెలా పల్లెప్రగతి నిధులు విడుదల చేసి పల్లెల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడింది. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు దానిని విస్మరించడంతో గ్రామీణులు సమస్యల బారినపడుతున్నారు.*



సిద్దిపేట జిల్లా చేర్యాలలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

సిద్దిపేట, మే 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ సంగారెడ్డి (నమస్తే తెలంగాణ): కేసీఆర్ పాలనలో కళకళలాడిన పంచాయతీలు, కాంగ్రెస్ పాలనలో వెలవెలబోతున్నాయి. నిధులు లేక నీరసించిపోతున్నాయి. ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇవ్వకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు కుంటుపడడంతో పాటు పారిశుధ్య పనులు అటకెక్కాయి. కేసీఆర్ ప్రభుత్వం ప్రతి గ్రామానికి ట్రాక్టర్, ట్రాలీ, నీటి ట్యాంకర్ ఏర్పాటు చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పంచాయతీలు ట్రాక్టర్ ఈఎంఐలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. చాలా పంచాయతీల్లో ట్రాక్టర్లలో డీజిల్ పోయించేందుకు నిధులు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. చెత్తసేకరణ, డంప్‌యార్డుకు చెత్త తరలించేందుకు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. డీజిల్ పోయించేందుకు డబ్బులు లేకపోవడంతో చెత్తసేకరణ అటకెక్కింది. పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు అందక పారిశుధ్య పనులు సరిగ్గా జరగడం లేదు. దీంతో గ్రామాల్లో పారిశుధ్య సమస్య నెలకొంది. కేసీఆర్ ప్రభుత్వం సంగారెడ్డి జిల్లాలోని 647 పంచాయతీల్లో 647 వైకుంఠధామాలు, 647 కంపోస్టు షెడ్లు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలను నిర్మించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటి నిర్వహణను గాలికి వదిలేసింది. హరితహారం అమలుపై ప్రభుత్వం ఇప్పటి వరకు అధికారులకు ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేయలేదు. దీంతో హరితహారం కొనసాగింపుపై అనుమానాలు నెలకొన్నాయి. గ్రామాల్లో నర్సరీలు, రోడ్డుపక్కన నాటిన మొక్కలకు నీళ్లు పోయకపోవటంతో ఎండిపోతున్నాయి. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కేసీఆర్ ప్రభుత్వం మొక్కలను కాపాడుకునేందుకు ప్రత్యేకంగా గ్రీన్ బడ్జెట్ కేటాయిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ దానిని విస్మరించింది.

### నిధులు లేక నీరసిస్తున్న పంచాయతీలు

కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధులు లేక పంచాయతీలు నీరసిస్తున్నాయి. సంగారెడ్డి జిల్లాలో 647 పంచాయతీలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వక పోవడంతో పంచాయతీలు పూర్తిగా జనరల్ ఫండ్‌పైనే ఆధార పడుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో జిల్లాలోని 647 పంచాయతీలకు ప్రభుత్వం పల్లెప్రగతి ద్వారా నిధుల కేటాయించింది. గత పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం పల్లె ప్రగతి ద్వారా 647 పంచాయతీలకు రూ.518.74 కోట్ల నిధులు విడుదల చేసింది. ఇవి కాకుండా 14వ ఆర్థిక సంఘం నిధులు, ఎస్సీ,ఎస్టీ కాంపోనెంట్ నిధులు ప్రత్యేకంగా వచ్చేవి. దీంతో గ్రామాల్లో అభివృద్ధి జరిగేవి. ఇవికాకుండా కేసీఆర్ సర్కార్ ప్రతి గ్రామానికి ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్‌ను అందజేసింది. పంచాయతీ సిబ్బందికి ప్రతినెలా వేతనాలను కేసీఆర్ సర్కార్ చెల్లించేది. దీంతో పంచాయతీలు ఎలాంటి సమస్యలు లేకుండా సమగ్ర అభివృద్ధితో కళకళలాడాయి. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ ద్వారా 647 పంచాయతీలకు ఇప్పటి వరకు నిధులు కేటాయించలేదు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.50 నుంచి రూ.100 కోట్లకుపైగా నిధులు రావాల్సి ఉండగా, ఇప్పటి వరకు పైసా రాలేదు. దీంతో జిల్లాలోని పంచాయతీలు జనరల్ ఫండ్ నిధులను ఖర్చు చేస్తున్నాయి. జనరల్ ఫండ్‌లో ఎక్కువగా ఇంటిపన్ను నుంచి నిధులు వస్తున్నాయి. జిల్లాలో 647 మైనర్ పంచాయతీలు ఉండగా, 300కు పైగా మేజర్ పంచాయతీలు ఉన్నాయి. మిగతా 300 పంచాయతీలు చిన్నవి, ఇక్కడ జనరల్ ఫండ్ తక్కువగా ఉంటుంది. దీంతో ఆయా పంచాయతీల్లో సమస్యలు నెలకొంటున్నాయి. జిల్లాలోని 647 పంచాయతీల్లో ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లు ఉన్నాయి. 240 పంచాయతీలు ప్రతినెలా ట్రాక్టర్ల ఈఎంఐలు చెల్లిస్తున్నాయి. 240 పంచాయతీల్లో 127 పంచాయతీల్లో గత ఐదు నెలలుగా ట్రాక్టర్ల ఈఎంఐలు చెల్లించలేని పరిస్థితి ఉంది. 200కు పైగా పంచాయతీల్లో ట్రాక్టర్లలో డీజిల్ పోయించలేని పరిస్థితి ఉంది. సర్పంచ్‌లు ఉన్న సమయంలో పెట్రోలు బంకుల్లో ఖాతాలు పెట్టి ట్రాక్టర్లలో డీజిల్ పోయించేవారు. పంచాయతీల్లో డబ్బులు ఉన్నప్పుడు చెల్లించేవారు. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులు ఉండడంతో పెట్రోలు బంక్‌ల యజమానులు డబ్బులు చెల్లిస్తేనే పోస్తామని పట్టుబడుతున్నారు. దీంతో 200కుపైగా పంచాయతీల్లో ట్రాక్టర్లు డీజిల్ లేక నడవని పరిస్థితి ఉంది. దీంతో చెత్తసేకరణ, పారిశుధ్య పనుల్లో సమస్యల తలెత్తుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలోని 647 పంచాయతీల్లో 3042 మంది పారిశుధ్య సిబ్బంది పనిచేస్తున్నారు. వీరికి ప్రతినెలా వేతనాలు చెల్లించాలి. మేజర్ పంచాయతీల్లో ప్రతి నెలా 20వ తేదీ తర్వాత వేతనాలు చెల్లిస్తున్నారు. చిన్న పంచాయతీల్లో నిధులు కొరత కారణంగా నాలుగు నెలలుగా పారిశుధ్య సిబ్బందికి వేతనాలు చెల్లించడం లేదు. దీంతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా జరగడం లేదు. ప్రభుత్వం మొదట కరెంటు బిల్లులు చెల్లించాలని చెబుతుండడంతో పంచాయతీ కార్యదర్శులు జనరల్ ఫండ్ నిధుల నుంచి మొదట కరెంటు బిల్లులు చెల్లించేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారు తప్ప పారిశుధ్య సిబ్బందికి వేతనాలు చెల్లించడం లేదు. గ్రామాల్లో చెత్త తొలగించక పోవడం, సేకరించకపోవడం, మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో పారిశుధ్య సమస్య నెలకొని ప్రజారోగ్యంపై ప్రభావం చూపనున్నది. సర్కారు నిధులివ్వక పోవడంతో తామేమీ చేయలేకపోతున్నామని పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పేర్కొంటున్నారు. దీంతో కాంగ్రెస్ సర్కారు తీరుపై గ్రామీణులు పెదవి విరుస్తున్నారు.



నీళ్లు లేక ఎండిపోయిన సంగారెడ్డి పట్టణంలోని పార్కు

### ఐదు నెలల నుంచి జీతాలు లేవు..



మాకు ఐదు నెలల సంది జీతాలు అస్త లేవు. పంచాయతీలో పనిచేసినా మా బతుకులు మారడం లేదు. ప్రభుత్వం మాకు జీతాలు ఇచ్చి ఆదుకోవాలి. లేకుంటే మా బతుకులు రోడ్డున పడ్తయి. జీతం వస్తేనే మా కుటుంబం నడుస్తుంది. లేకుంటే పస్తులుండుడే. గీ కాంగ్రెస్ సర్కారు మమ్మల్ని పట్టించుకోవాలి.

–నర్సింహులు, పారిశుధ్య కార్మికుడు, శివ్వాయపల్లి, రామాయంపేట (మెదక్ జిల్లా)

### జీతం వస్తేనే నోట్లోకి మెతుకులు..



జీతాలు ఐదు నెలల నుంచి ఆగిపోవడంతో కిరాణా దుకాణాల్లో అప్పులు పెరిగి పోతున్నాయి. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. జీతాలను ఇప్పుడిస్తాం అప్పుడిస్తాం అంటూ నెలలు గడుపుతున్నారు. నెలనెల జీతం రాకుంటే మా కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారింది.

–మల్లవ్వ, పారిశుధ్య కార్మికురాలు, శివ్వాయపల్లి, రామాయంపేట మండలం

# రైతు కంట కన్నీరు

## మూడు రోజులుగా కురుస్తున్న వర్షం



ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

- తడుస్తున్న ఆరబెట్టిన ధాన్యం
- ఊపందుకోని ధాన్యం కొనుగోళ్లు

గజ్వేల్, మే 19: మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు కళ్లాల్లోని ధాన్యం తడిసిముద్దవుతున్నది. రైతుల నుంచి త్వరగా ధాన్యం సేకరించక పోవడంతో వర్షానికి వడ్లు తడస్తున్నాయి. రోజుల తరబడి ధాన్యం రోడ్లపైనే ఆరబెట్టడంతో ఆకాల వర్షాలకు తడిసిపోయి మొలకెత్తుతున్నది. అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరో నాలుగు రోజుల పాటు వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యం ఆరేలోపునే మళ్లీ వర్షాలు కురవడం పరిపాటిగా మారింది. గజ్వేల్ మండలంలోని సింగాటం, అహ్మదీపూర్, కొల్గూర్, దిలాల్‌పూర్, బూరుగుపల్లి, శ్రీగిరిపల్లి, ధర్మారెడ్డిపల్లి, గిరిపల్లి, గ్రామాల సమీపంలోని రోడ్లపైన, గజ్వేల్ రింగ్‌రోడ్డుపైన వందలాది మంది రైతులు యాసంగిలో పండించిన ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరబెట్టిన ధాన్యాన్ని ఒక్క దగ్గరకు చేర్చేలోపే ఆకస్మాతుగా కురుస్తున్న వర్షానికి ధాన్యం తడిసిపోతున్నది. గజ్వేల్ నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో రైతుల ఇదే ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. తడిసిన ధాన్యం రంగు మారుతోంది. గజ్వేల్ మండలంలో పీఏసీఎస్ అధ్వర్యంలో 10, ఐకేపీ ఆధ్వర్యంలో మరో 8 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ, వీటిలో కొనుగోళ్లు వేగంగా సాగడం లేదు. ప్రజ్ఞాపూర్‌కు చెందిన రైతు మర్కంటి నర్సింలు తనకున్న రెండు ఎకరాల్లో సన్నరకం వరిసాగు చేశాడు. గత బుధవారం వరికోత కోసి మరుసటి రోజు నుంచి వడ్లను గజ్వేల్ రింగ్‌రోడ్డుపై ఆరబెడుతున్నాడు. ప్రతిరోజు వర్షం కురుస్తుండడంతో ఎండిన ధాన్యం తడుస్తున్నది. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు తడిసిన వడ్లు మొలకెత్తాయి. ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు వాటిని ఆరబెడుతున్నాడు. మరో నాలుగు రోజుల పాటు వర్షాలు ఉండడంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం త్వరగా ధాన్యం సేకరణ చేస్తే నష్టం వాటిల్లదని, లేకపోతే తీరని నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. చాలా గ్రామాల్లో ధాన్యం ఆరబెట్టడానికి ఖాళీ స్థలాలు లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఒకరి తరువాత మరొకరు ధాన్యాన్ని రోడ్లపైన ఆరబెడుతున్నారు.



గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొలకెత్తిన ధాన్యం

# బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక

- మెదక్ ఎంపీ స్థానంలో భారీ మెజార్టీతో విజయం సాధిస్తున్నాం
- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి
- హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలం
- రూ.400 కోట్ల నిధులు ఆపిన కాంగ్రెస్ సర్కారు
- రాజకీయాల కోసం అభివృద్ధిని అడ్డుకోవడం తగదు
- పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి





పటాన్‌చెరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



సమావేశానికి హాజరైన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

పటాన్‌చెరు, మే 19: కార్యకర్తలే బీఆర్‌ఎస్ పార్టీకి వెన్నెముక అని, కార్యకర్తల కృషితో మెదక్ ఎంపీ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలువబోతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్‌లోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ నియోజకవర్గస్థాయి కృతజ్ఞత సభ, స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పటాన్‌చెరు నియోజకవర్గంలో జరిగిన ప్రతి ఎన్నికలోనూ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లో మెదక్ స్థానం పోటీచేసిన వెంకట్రామిరెడ్డి విజయ కోసం కార్యకర్తలు అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. ఆయన భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. పదేండ్లలో ప్రతి గ్రామంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో చేయనన్ని పనులు పటాన్‌చెరులో చేసినట్లు తెలిపారు. అభివృద్ధిని చూసి ఓటు అడగాలని క్యాడర్‌కు పిలుపునిచ్చారు. దొంగ హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు వాటి అమలులో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. పటాన్‌చెరు నియోజకవర్గానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేటాయించిన రూ.400 కోట్ల నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలు తగదని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, సీనియర్ నాయకులు శంకర్ యాదవ్, తదితరులు ప్రసంగించారు. సమావేశంలో ఎంపీపీలు దేవానందం, ప్రవీణ విజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీలు సుధాకర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, సింధూఆదర్శ్‌రెడ్డి, పుష్పానగేశ్, మాజీ ఎంపీపీలు శ్రీశైలం యాదవ్, యాదగిరి యాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయకుమార్, సోమిరెడ్డి, దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కుమార్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శివ్వంపేటలోని కొనుగోలు కేంద్రం వద్ద వర్షానికి ధాన్యం తడుస్తుండడంతో ఇబ్బందులు పడుతున్న రైతులు

# శివ్వంపేటలో భారీ వర్షం

- ధాన్యాన్ని కాపాడుకోవడానికి తిప్పలు పడ్డ రైతులు


శివ్వంపేట, మే 19: మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో ఆదివారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. వర్షంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శివ్వంపేట కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం కుప్పలపై కవర్లు కప్పడంతో పాటు నీరు నిల్వకుండా పక్కకు వెళ్లేందుకు రైతులు పారలతో కాలువలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. కేంద్రాల్లో ధాన్యం త్వరగా కొనుగోలు చేయాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు. లేకపోతే తాము తీవ్రంగా నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శివ్వంపేటలోని కొనుగోలు కేంద్రం వద్ద..

# నేలకూలిన కరెంట్ స్తంభం

చిన్నశంకరంపేట, మే 19: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం రాత్రి బలమైన ఈదురు గాలులు వీచాయి. చందాపూర్ గ్రామ శివారులో ఈదురుగాలికి కరెంటు స్తంభం నేలకూలింది. మండలంలోని అంబాజిపేట, రుద్రారం, చందంపేట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. ధాన్యం తడవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చందాపూర్ శివారులో నేలకూలిన కరెంట్ స్తంభం



జోగిపేట బస్టాప్‌లో చేరిన వరద నీరు

# జోగిపేటలో భారీ వర్షం

అందోల్, మే 19: జోగిపేటతో పాటు పరిసర గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో అంతర్గత రోడ్లతో పాటు ప్రధాన రహదారులపైకి పెద్దఎత్తున వర్షపు నీరు వచ్చి చేరడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ బస్టాప్‌లో మోకాలులోతు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. జోగిపేట–సంగారెడ్డి ప్రధాన రహదారిపై పలు చోట్ల భారీగా వరద నీరు చేరింది. రోడ్లు, కల్లాలు, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. పలు గ్రామాల్లో ఈదురు గాలులకు చెట్లు పడిపోగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అందోల్–జోగిపేట మున్సిపాలిటీతో పాటు గ్రామాల్లో డ్రైనేజీలు నిండి నీరంతా రోడ్లపై చేరి దుర్గంధం వ్యాపించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.